క్లుప్తంగా

వెంకన్నకు విశేష పూజలు



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 23వ రోజు మంగళవారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై, పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి చేశారు. తిరుప్పావై 23వ పాశురాన్ని విన్నవించారు. పాశుర భావాన్ని భక్తులకు వివరించారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

గురుకుల పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లను అందిస్తున్న దేవరాపల్లి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు దేవరాపల్లి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు 10 సీలింగ్ ఫ్యాన్లను వితరణగా ఇచ్చారు. గురుకుల పాఠశాలలో మంగళవారం ఈ ఫ్యాన్లను ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణకు పూర్వ విద్యార్థులు ఆర్.త్రినాథ్, ఎస్.శ్రీను, సీహెచ్ నాయుడు, అనిల్, కోటేశ్వరరావులు అందించారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు టి.రాంబాబుకు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని, తల్లి దండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సబ్బవరం గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు చిరంజీవి, ప్రభాకరరావు, రఘు రామనాయుడు, సాయిరాం, మోహనరావు, సింహాచలం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

10న అంతర్ జిల్లాల ఆర్చరీ ఎంపిక పోటీలు

పరవాడ: ఈ నెల 10న ఉదయం 10 గంటలకు అంతర్ జిల్లాల జూనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్ రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చర్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.నిశాంత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆర్చర్లు తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, జనన ధ్రువ పత్రం వెంట తీసుకురావాలని కోరారు.

పోరాట స్ఫూర్తి.. కామ్రేడ్ బాలకృష్ణ



బాలకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

పరవాడ: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన ఘనత రైతు సంఘంమాజీ జిల్లా నాయకుడు కామ్రేడ్ బాలకృష్ణకు దక్కుతుందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం అన్నారు. కామ్రేడ్ బాలకృష్ణ ప్రథమ వర్ధంతిని వాడచీపురుపల్లిలో మంగళవారం నిర్వహించారు. బాలకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీరణకు వ్యతిరేకంగా ఆయన ఎన్నో పోరాటాలు చేశారని పేర్కొన్నారు. జిల్లాలో ఏటికొప్పాక, తుమ్మపాల, తాండవ సుగర్ ఫ్యాక్టరీలు తెరవాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించడమే కాకుండా అనకాపల్లి బెల్లం ఉద్యమం, చెరకు రైతుల సమస్యలు, మున్సిపల్ కార్మికుల సమస్యలపై చేసిన పోరాటాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ; నాయకులు కె.ఆదిలక్ష్మి, ఎ.వరలక్ష్మి, పరదేశమ్మ, మౌనిక పాల్గొన్నారు.



నాలుగు కాళ్లు పీటపై వేసి గంగిరెద్దు అద్భుత విన్యాసం

దూడూ బసవన్నా.. సింహాద్రి అప్పన్నా.. అయ్యగారు, అమ్మగారు కుటుంబంతో సహా చల్లంగా ఉండాలని దీవించు.. అయ్యగారి గుమ్మంలో కుడికాలెట్టి ఆశీర్వదించు.. నీ దాణా(ఆహారం)కు గుప్పెడు గింజలు.. నాకోసం అయ్యగారి పాత దుస్తులు అడుగు.. అంటూ గంగిరెద్దుల వారు ఇంటింటికీ తిరగడం సంక్రాంతి సమయంలో ఆనవాయితీ. నియోజకవర్గంలోని పల్లెల్లో డూడూ బసవన్నల సందడి మొదలైంది.



గంగిరెద్దులతో సంక్రాంతి సంబరాలకు ఆహ్వానం పలుకుతూ..

సందడి చేస్తున్న డూడూ బసవన్నలు

- సంక్రాంతి సంబరాల్లో గంగిరెద్దుల హడావుడి
- అద్భుత విన్యాసాలతో ఆకట్టుకుంటున్న వైనం
- ఒకప్పటి ఆదరణ లేదంటున్న గంగిరెద్దులవారు

పెందుర్తి:

సంక్రాంతి పండగ మరెన్నో రోజులు లేదు. ఈ పుణ్య దినాల్లో పరమేశ్వరుడి వాహనమైన నందీశ్వరుని అంశ గంగిరెద్దు తమ ఇళ్లకు రావడాన్ని గ్రామీణ ప్రజలు అదృష్టంగా భావిస్తారు. సంక్రాంతికి 15 రోజుల ముందు నుంచే గంగిరెద్దులు ఇంటింటికీ తిరుగుతూ గుమ్మంలో కుడికాలు మోపి ఆశీస్సులు అందిస్తున్నాయి. సింహాద్రి అప్పన్న పేరుతో పిలుచుకునే గంగిరెద్దులను గ్రామాల్లో తిప్పుతూ వాటి యజమానులు పొట్టపోసుకుంటున్నారు. వంశపారంపర్యంగా ఈ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలు నియోజకవర్గంలో చాలా ఉన్నాయి.



గంగిరెద్దులతో సంక్రాంతి సంబరాలకు బయలుదేరిన బుడగ జంగాలు

ఏటా రెండు మాసాలు

ప్రధానంగా నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో గంగిరెద్దులను ఆడించి, పొట్టపోసుకునే వారు ఎక్కువగా ఉన్నారు. ఏడాదిలో దాదాపు రెండు నెలలపాటు వీరి భత్యానికి పెద్దగా లోటు ఉండదు.. తమ ఇళ్లకు వచ్చిన గంగిరెద్దుల వారి నుంచి దీవెన తీసుకున్న ప్రజలు తోచినంత నగదు, బియ్యం, ధాన్యం, వస్త్రాలు దానం చేస్తుంటారు. ప్రస్తుతం సనాతన సాంప్రదాయలు కనుమరుగవుతున్న సమయంలో ఈ గంగిరెద్దుల ఆటకు కూడా ఆదరణ తగ్గుతోంది.

నెలగంట తరువాత బిజీ

ఏటా నెల గంట పెట్టిన తరువాత గంగిరెద్దుల పర్యటన ప్రారంభమవుతుంది. దాదాపు రెండు నెలల పాటు వీరు గ్రామాల్లో తిరుగుతూ ఆదాయం సమకూర్చుకుంటారు. ముఖ్యంగా సంక్రాంతి సమయంలో తీరిక లేకుండా ఉంటారు. శివరాత్రి వరకు గ్రామాల్లో తిరిగే వీరు దేవుడి పెళ్లి సమయానికి సింహాచలం చేరుకుని మొక్కులు చెల్లించుకుంటారు. తరువాత ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు.

వేషాలు.. విన్యాసాలు

భోగి పండగ రోజు పుట్టిన దూడ(తోటపెద్దు)ను సాధారణంగా రైతులు దేవుడికి ఇచ్చేస్తారు. సింహాచలం లేదా గ్రామాల్లోని ఆలయాల వద్ద వీటిని వదిలేస్తారు. గంగిరెద్ల కులస్తులు వీటిని సేకరించి రకరకాల విద్యలు నేర్పిస్తారు. చిన్న పీటపై నాలుగు కాళ్లు పెట్టి నిలబడ్డం, తల ఊపుతూ ఆశీర్వచనం అందించడం, ఇంట్లో కుడికాలు మోపడం వంటివి నేర్పించడానికి ప్రత్యేక గురువు వద్దకు తీసుకెళ్తారు. ఇందుకు రూ.10 వేలు వరకు వెచ్చించి శిక్షణ అందిస్తారు. విద్యలు నేర్చుకున్న ఎద్దుకు గంటలు, మువ్వలు, దుప్పట్లు, ఇతర అలంకరణ వస్తువులతో వేషం కట్టిస్తారు. గ్రామాల్లో జనం ఉన్నచోట గంగిరెద్దులు చేసే విన్యాసాలు అద్భుతంగా ఉంటాయి. వీళ్లకు తోడుగా కొమ్ముదాసరి, బుడగ జంగాల వేషధారులు కూడా సంక్రాంతి సందడిలో భాగస్వాములు కావడంతో పండగ కల పల్లెల్లో ఉట్టిపడుతోంది.



గుండెలపై కాళ్లు వేయించుకుని ఆటాడిస్తున్న కళాకారుడు

ఆదరణ తగ్గుతోంది



మా పూర్వీకుల నుంచి ఈ వృత్తి మీదే బతుకుతున్నాం. సంకురాత్రికి ఇలా ఎద్దులను తిప్పుతా ఏసాలు కట్టేటోళ్లం. ఇప్పుడు మా వారసులు అక్కడక్కడా ఈ వృత్తిలో ఉంటన్నారు. గతంలో మేం ఊళ్లకు ఎలితే బాగా సూసుకునేటోళ్లు. రాన్రాను ఎవలూ పట్టించుకోవడంనేదు. ఏదో పాతతరం వారు ఉంతే నాలుగు డబ్బులిత్తన్నారు. మా కులపోళ్లు పండగ తరవాత కూలిపనులకు, ఫ్యాన్సీ వస్తువులు అమ్ముకుంటూ బతుకులెల్లదీత్తన్నారు.

– ఆవాల పెద్దోడు, గంగిరెద్ల కాలనీ, సబ్బవరం

దేవుడి అంశ



ఏటా సింహాద్రి అప్పన్న బాబు పేరు సెప్పుకుని పొట్ట పోసుకుంటున్నాం. డూడూ బసవన్నలకు ఒకప్పటంత ఆదరణ నేకపోయినా పట్టణంలో మాత్రం కాస్త బాగానే చూసుకుంతన్నారు. దేవుడి అంశ అని ఇంకా సేనామంది ప్రజలు నమ్ముతున్నారు.. కాబట్టే ఒక్కో ఇంటి దగ్గర బాగానే ఆళ్లకు తోసింది ఇస్తున్నారు. చనిపోయిన పెద్దలను పొగిడించుకుంటున్నారు. వారిచ్చిన బియ్యం గింజలు, బట్టలే మాకు దాదాపుగా ఏడాదికి ఆధారం.

– ధనకొండ చిన్నారావు, సబ్బవరం

సంప్రదాయాన్ని వదులుకోలేక..



మేం బుడగ జంగాలం. సంక్రాంతి సమయంలో గ్రామగ్రామాన ఇంటింటికీ వెళ్లి.. పితృదేవతలు, పెద్దలను పొగుడుతుంటాం. ప్రస్తుతం గతంలో ఉన్నంత ఆదరణ లేకపోయినా సంప్రదాయాన్ని వదులుకోలేక కులవృత్తిని కొనసాగిస్తున్నాం. కొంత మంది యువకులు సరదా కోసం మమ్మల్ని కాసేపు కూర్చోబెట్టి, మాట్లాడిస్తారు. మరి కొందరు కసురుకుంటారు. ఏడాదిలో ఈ 15 రోజులే. రాబోయే తరాలు మా వృత్తిపై ఆసక్తి చూపట్లేదు.

– బత్తిన అప్పారావు, బుడగ జంగాలు, సబ్బవరం

విశాఖ డెయిరీ సంక్రాంతి బోనస్ పంపిణీ



పాల ఉత్పత్తిదారులకు సంక్రాంతి బోనస్ చెక్కును అందిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు తదితరులు

సబ్బవరం: పాడి రైతుల సంక్షేమం, అభివృద్ధికి విశాఖ డెయిరీ నిరంతరం కృషి చేస్తుందని డెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు తెలిపారు. మండలంలోని సబ్బవరం యూనిట్ బల్క్ మిల్క్ సెంటర్‌లో సంక్రాంతి పండగ నగదు బదిలీ పథకంలో భాగంగా మంగళవారం నిర్వహించిన బోనస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యూనిట్ పరిధిలోని విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు రెండు పేమెంట్లను బోనస్‌గా అందించారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు పాల ఉత్పత్తిదారులకు పండగ బోనస్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్బవరం యూనిట్ పరిధిలోని 104 పాల సొసైటీలకు చెందిన 10,206 మంది పాడి రైతులకు రూ.4.68 కోట్లు బోనస్‌గా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పాడి పశువుల బీమా పరిహారంగా రూ.5.15 లక్షలు, పాడి రైతుల బీమా పరిహారం రూ.2.25 లక్షలు నగదు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనిట్ అఫీసర్ ఏఆర్ ప్రభాకర్, యూనిట్ పరిధిలోని సిబ్బంది, స్థానిక పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షులు, వేతన కార్యదర్శులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో దివ్యాంగుల అభ్యున్నతి



ఏపీసీ జయప్రకాష్‌కు మొక్కను అందిస్తున్న దివ్యాంగ చిన్నారి

పరవాడ: దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.జయప్రకాష్ అన్నారు. పరవాడ భవిత కేంద్రాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా అన్ని రకాల సేవలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. అలవెన్స్‌లు, ఉపకరణాలను ఉచితంగా అందిస్తుందన్నారు. దివ్యాంగులకు అవసరమైన స్పీచ్ థెరపీ, ఫీజియో థెరపీ ఇస్తూ వారి శారీరక, మానసిక వికాసానికి తోడ్పాటునిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిత కేంద్రంలో అమలు జరుగుతున్న కార్యక్రమాలు, దివ్యాంగులకు కల్పిస్తున్న సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. దివ్యాంగులకు అమలు జరుగుతున్న ఫిజియోథెరపీపై దివ్యాంగుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, ఫిజియోథెరపిస్ట్ కిరణ్, వెంకటలక్ష్మి, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, శ్రీనివాసరావు, దివ్యాంగులు, తల్లిదండ్రులు ఉన్నారు.

ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు



పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి



తిరువీధిలో గోదాదేవి అమ్మవారికి హారతి అందిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని శోభాయమానంగా అలంకరించి బంగారుచాయ పల్లకీలో అధిష్ఠింపజేశారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి ఆలయ బేడా మండపంలో విశేషంగా తిరువీధి జరిపారు. షోడపోపచార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవికి ఆలయ బేడామండపంలో విశేషంగా తిరువీధి చేపట్టారు. అమ్మవారి సన్నిధిలో పాశుర విన్నపం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

రైతు బజార్‌లో పక్కాగా ప్లాస్టిక్ నిషేధం అమలు



వి.పద్మావతి షర్మిల, ఈవో రైతు బజార్

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుబజార్‌లో పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నట్లు ఈవో వి.పద్మావతి షర్మిల తెలిపారు. మంగళవారం ఆమె సాక్షితో మాట్లాడుతూ రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులు తమ ఇంటి వద్ద నుంచే ప్లాస్టిక్‌యేతర చేతి సంచులను వెంట తెచ్చుకోవాలని సూచించారు. రైతులు ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను వినియోగదారులకు ఇస్తే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు కూడా ప్లాస్టిక్ నిషేధానికి స్వచ్ఛందంగా సహకరించాల్సిందిగా కోరారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా పెందుర్తిలో కార్మికుల ఆందోళన



పరవాడలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రతినిధులు

- సీఎం, డీసీఎంలు ప్రధానిపై ఒత్తిడి తేవాలి
- పెందుర్తిలో సీఐటీయూ, పరవాడలో సీపీఎం ఆధ్వర్యంలో కార్మికుల నిరసన

పెందుర్తి: నేడు విశాఖ వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని చెప్పాలని సీఐటీయూ పెందుర్తి జోన్ కార్యదర్శి జి.శంకర్రావు డిమాండ్ చేశారు. ప్రధాని పర్యటన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయంపై పెందుర్తి, చినముషిడివాడ, పురుషోత్తపురం ప్రాంతాల్లోని చిన్న పరిశ్రమలు, దుకాణాల వద్ద కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏళ్ల తరబడి ఉద్యమం జరుగుతున్నా ప్రధాని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ మద్దతుగా నిలవడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటుంటే టీడీపీ, జనసేనలు మిన్నకుండిపోవడం ఏంటని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్, లోకేష్ చేస్తున్న ప్రకటనలకు, ప్లాంట్‌లో జరుగుతున్న పనులకు పొంతన కుదరడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో స్టీల్‌ప్లాంట్‌ను నట్టేట ముంచేసి, నక్కపల్లిలోని మిట్టల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఊపిరిపోయడం హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సభలో ప్రధానితో దీనిపై స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు కె.అప్పలనాయుడు, మరిడయ్య, రమణ పాల్గొన్నారు.

పరవాడ: ఈ నెల 8న విశాఖ నగరానికి విచ్చేస్తున్న ప్రధాని మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పష్టమైన ప్రకటన చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సీపీఎం నాయకుడు వి.వి.రమణ హెచ్చరించారు. స్థానిక సినిమాహాలు కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్కపల్లిలో నెలకొల్పనున్న బల్క్‌డ్రగ్స్ పరిశ్రమ వలన కాలుష్యం పెరిగే అవకాశాలు విపరీతంగా ఉన్నాయని ఆందోళన తెలిపారు. పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మిట్టల్ స్టీల్‌ప్లాంటును ఉపసంహరించి విశాఖ ఉక్కు పరిశ్రమ సమర్థవంతమైన నిర్వహణకు సొంతగనులను కేటాయించాలన్నారు. దేవరాపల్లి హైడ్రో పవర్ ప్రాజెక్టు వలన గిరిజన జీవితాలు అతలాకుతలమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్యుతాపురంలో ఏర్పాటు చేయనున్న గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులో నిర్వాసితులకు 75 శాతం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో సీపీఎం నాయకులు కొప్పాక దేముడు, జి.అప్పారావు, కె.నాయుడు, బి.లచ్చిబాబు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

థాంగ్ టాలో ఎన్టీపీసీ విద్యార్థుల ప్రతిభ



థాంగ్ టా జూనియర్, సీనియర్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

పరవాడ: ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఢిల్లీ, ఉత్తరాఖండ్, హరిద్వార్, ప్రేమ్‌నగర్ ఆశ్రమంలో జరిగిన 30వ జాతీయ స్థాయి థాంగ్ టా సబ్ జూనియర్, సీనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో ఎన్టీపీసీ విద్యార్థులు పతకాల పంట పండించారని టెక్నికల్ డైరెక్టర్ గొర్లి పుష్పారావు తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీపీసీకి చెందిన 14 మంది విద్యార్థులు పాల్గొని పతకాలు గెల్చుకున్నట్లు పేర్కొన్నారు. సమీక్షా సాహు 49 కిలోల సబ్ జూనియర్ విభాగంలో కాంస్యం, కేకేఎస్ సాత్విక్ సబ్ జూనియర్(బి) 37 కిలోలు, డి.ధనహర్షిణి, ఐ.చేతన్‌సాయి సబ్ జూనియర్(బి) 53 కిలోల విభాగాల్లో కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. రేకవానిపాలేనికి చెందిన మొల్లి తులసీరావు సీనియర్(ఎం) కాంస్యం, అచ్యుతాపురానికి చెందిన కలిదిండి అక్షిత్‌వర్మ సబ్‌జూనియర్(బి) 33 కిలోల విభాగంలో కాంస్యం, ఎం.పవన్‌కుమార్ సీనియర్స్(ఎం) 45 కిలోల విభాగంలో కాంస్యం, ప్రవంతి 80 కిలోల సీనియర్స్(డబ్ల్యూ) విభాగంలో కాంస్య పతకాలు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలను మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో షెల్టన్ జేమ్స్, రాగిణి, మృదుల్‌కార్న్, అశ్విన్ అనీష్, ప్రవంతి సాహు పాల్గొన్నారు.

పాదయాత్రగా సింహగిరికి..



పాదయాత్రగా తరలివస్తున్న భక్తులు

సింహాచలం: విజయనగరం జిల్లా మంగళపాలేనికి చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వందలాది భక్తులు, గిరిజనులు సింహగిరికి పాదయాత్రగా తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామికి పూజలు నిర్వహించారు. సింహగిరిపై హరినామ సంకీర్తనలు ఆలపించారు. ఏటా ధనుర్మాసం రోజుల్లో సింహగిరికి పాదయాత్రగా తరలిరావడం ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు రాపర్తి జగదీష్ తెలిపారు.